సఖీకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్



# సఖీ కేంద్రాలతో మహిళలకు భరోసా

- మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్
- మెదక్ జిల్లా కేంద్రంలో సఖీ భవనం ప్రారంభం
- బాలసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన

మెదక్ రూరల్ ,అక్టోబర్ 5 : ఆపదలో ఉన్న మహిళలు, వేధింపులకు గురైన చిన్నారులకు సఖీ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో రూ. 73.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సఖీ భవన కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం బాలసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాధితులు ఎవరైనా సఖీ కేంద్రానికి వచ్చి న్యాయం పొందవచ్చన్నారు. మహిళా భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదని ఇందులోభాగంగా మహిళా హెల్ప్‌లైన్ 181ను ప్రారంభించిందని తెలిపారు. మహిళలు, యువతులు తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా సఖీ కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఇఫ్కో డైరక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి బ్రహ్మాజీ, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మెదక్‌లో మంత్రి సత్యవతి రాథోడ్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

# మెదక్‌కు మహర్దశ



మెదక్‌లో కురుమ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

మెదక్ అర్బన్, అక్టోబర్ 5 : గతుకుల మెదక్‌గా పేరున్న మెదక్‌ను.. బతుకుల మెదక్‌గా మార్చిన ఘనత మన సీఎం కేసీఆర్‌దే అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మెదక్ జిల్లాకు రూ.180 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారని, ఇప్పుడున్న దవాఖానతో పాటు అదనంగా మరో రూ.180 కోట్లతో 450 పడకలతో దవాఖానాని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాలో సూది ఉంటే గోలి ఉండేది కాదు... గోలి ఉంటే డాక్టరు ఉండకపోవు...కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం 150 మంది డాక్టర్లతో వైద్యం అందించనున్నదన్నారు. రోగులు ఇక్కడి నుంచి గాంధీ, నిమ్స్ దవాఖానాలకు వెళ్లే అవసరం లేకుండా అదే స్థాయి వైద్యం త్వరలో మెదక్‌లో అందుబాటులోకి వస్తున్నదని వెల్లడించారు. మతాశిశు సంరక్షణ దవాఖాన ఏర్పాటు చేయడంతో 100కు 82 శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరుగుతున్నాయని అన్నారు. డెలివరీ తర్వాత తల్లీబిడ్డను క్షేమంగా 108 అంబులెన్స్‌లో ఇంటి వద్ద దిగబెడుతున్నారన్నారు. ఒకప్పుడు మెదక్ జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండేవని, అలాంటి పరిస్థితులను రూపుమాపి తళతళామెరిసే మెదక్‌గా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. గతంలో అన్ని కార్యాలయాలు సంగారెడ్డిలో ఉండేవని, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషితో ఇప్పుడు మెదక్‌లోనే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు వచ్చాయన్నారు. ఘణపురం ఆనకట్ట ఎత్తు పెంచి, కాలువలకు మరమ్మతులు చేయడంతో చిట్టచివరి భూములకూ నీరంచడంతో రైతులు సంతోషంగా రెండు పంటలు వేసుకుంటున్నారన్నారు. ఎంతో మంది కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేసినా తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరక్క ఇబ్బందులు పడ్డారని, నీళ్ల కోసం రాస్తారోకోలు చేసి బిందెలు అడ్డం పెట్టేవారని గుర్తుచేశారు. అప్పట్లో ఘణపురం నీళ్లు కావాలంటే హైదరాబాద్ పోయి పైరవీ చేసేవారని, ప్రస్తుతం నీళ్లు లేవని పద్మకు ఒక్క ఫోను కూడా రావట్లేదన్నారు. హెచ్‌ఆర్సీసీలో కేసులు లేవు, రోడ్డు ఎక్కడు లేదు.. ధర్నాలు చేసుడులేదన్నారు. రాబోయే రోజుల్లో శంకరంపేట్, మెదక్ రూరల్, పాపన్నపేటకు కాలువ కింద నీళ్లు తీసుకువచ్చి రెండు పంటలు పండించుకునేలా కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు ఎరువుల బస్తాలు, కరెంటు కోసం, పండిన పంటలు ఎవరూ కొనక అన్నదాతలు ఎన్నో అవస్థలు పడ్డారని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరంతరంగా 24 గంటల కరెంటు సరఫరా అవుతున్నదని, మోటర్లు కాలిపోవడం లేదన్నారు. ఎరువుల నిల్వాలు దండిగా ఉన్నాయని, పంటలను ప్రభుత్వమే కొంటున్నదని తెలిపారు. తొమ్మిదేండ్లలో కరువు, కర్ఫ్యూ లేకుండా తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో నాట్లు వేసేందుకు మనుషులు దొరకడం లేదని చత్తీస్‌గఢ్ నుంచి మగకూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామని, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ కల్పించమన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్‌కు రైలు తెచ్చింది, మెడికల్ కళాశాల తెచ్చింది, రామయంపేటకు రెవిన్యూ డివిజన్ తీసుకువచ్చింది, రెసిడిన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేయించిందన్నారు. కొంత మంది హైదరాబాద్ నుంచి నోట్ల కట్టలు తీసుకువచ్చి మెదక్‌ను ఆగం చేయడానికి చూస్తున్నారని ఎద్దేవా చేశారు. పద్మ మెదక్ ఆడ బిడ్డ అని.. సాదాసీదా మనిషి, పిలిస్తే పలికే పద్మకే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.



మెదక్ చర్చిగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## మెదక్‌లోనే మెరుగైన వైద్యసేవలు

అన్ని హంగులతో మెదక్ జిల్లాను అభివృద్ధి చేసుకున్నామని, కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సంఘానికి నిధులు మంజూరు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో 33 మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేయగా, మెదక్ జిల్లాకు కూడా కేటాయించారని, నర్సింగ్ కళాశాల ఏర్పాటు కూడా అందుబాటులోకి రాబోతున్నదన్నారు. నేడు మెడికల్ కళాశాలకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ఏ చిన్న ఇబ్బంది ఉన్నా హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తైతే మెదక్‌లోనే మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, మెదక్ ఎంపీపీ యమున, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు





మెదక్ జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్ రావు

# మెదక్ జిల్లా గ్రంథాలయం ప్రారంభం

మెదక్ అర్బన్, అక్టోబర్ 5 : మెదక్ జిల్లా కేంద్రంలో గ్రంథాలయ చైర్మన్ దొంతి చంద్రాగౌడ్ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్లతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని గురువారం మంత్రి హరీశ్ రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్ మంత్రి హరీశ్ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాతగం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ మెదక్ జిల్లా ఏర్పాటు తర్వాత మెదక్ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదన్నా రు. మెదక్‌లో విద్యార్థులకు అన్ని హంగులతో గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు గ్రంథాలయంలోని పుస్తకాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయం లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన జిల్లా గ్రంథాలయం వద్ద డప్పుచప్పుళ్లతో మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలికారు.



మెదక్ జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు



మెదక్‌లో మంత్రులు హరీశ్ రావు, సత్యవతి రాథోడ్‌తో కలిసి సఖీ కేంద్రానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళాకమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రులు హరీశ్ రావు, సత్యవతి రాథోడ్
- రూ.60 కోట్లతో మెదక్ జిల్లాలో ఎరుకల సాధికారతతో ఆత్మగౌరవం
- మెదక్‌లో ఎరుకల సాధికారత పథకం ప్రారంభం



మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

మెదక్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్లోని అడిటోరియంలో జరిగిన ఎరుకల సాధికారిత పథకం ప్రారంభోత్సవానికి మంత్రులు, తన్నీరు హరీశ్ రావు, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎరుకలకు సొసైటీలను ఏర్పాటు చేయడం, స్లాటర్ హౌసులు ఏర్పాటు, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చడం, ఆన్‌లైన్ వ్యాపార మెలకువలు, తదితర అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఎరుకుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకం తీసుకురావాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ పట్టుపట్టి ముఖ్యమంత్రిని ఒప్పించి ఈ పథకం తీసుకొచ్చినట్లు తెలిపారు. రూ.60 కోట్లతో ఎరుకల సాధికారిక పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఎరుకల కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నది అన్నా రు. సమాజంలో అట్టడుగు వర్గానికి చెందిన ఎరుకల కులానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ఎమ్మెల్సీగా చేయడానికి ముఖ్యమంత్రి నిర్ణయించి ప్రతిపాదనలు పంపినప్పటికీ గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ నాయకులు సత్యనారాయణను ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### గిరిజన సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు

గిరిజనుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటిసారి దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజనుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తూ అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ పథకం ద్వారా ఎరుకల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులను అందజేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని ఎరుకలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కేంద్రం ప్రభుత్వం అడుగడుగునా తెలంగాణకు నిధులు ఇవ్వకుండా అడ్డుపడుతున్నప్పటికీ సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు.

### ఎరుకల సాధికారత పథకం మెదక్ జిల్లా నుంచి అమలు కావడం అదృష్టం

ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరుకల సాధికారత పథకం మొట్టమొదటిగా మెదక్ జిల్లాలో అమలు చేయడం తన అదృష్టం గా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఎరుకల కులస్తులు వ్యాపార మెలకువలు నేర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. జీవన విధాన శైలిలో మార్పు లు రావాలని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల వారికి జీవనోపాధి కల్పిస్తున్నారని గుర్తు చేశారు. మెదక్ జిల్లాలో ఎరుకల సాధికారత పథకం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మండలంలో పందుల పెంపకానికి స్థలం ఇస్తామని, మండలానికి ఒక యూనిట్‌ను మంజూరు చేస్తూ రూ.60 లక్షలు కేటాయించామన్నారు.ఎరుకల జాతి ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైకా చైర్మన్ రాంచందర్ నాయక్, గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్.చోంగ్తు, జడ్పీ చైర్మన్ హేమలతా శేఖర్ గౌడ్, వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఎరుకల నాయకులు కూతాడి రాములు, రాజు, నర్సింహులు, వివిధ జిల్లాల ఎరుకల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ప్రజలు

